'చిత్తం! ఎవర్ని చేయమంటే ఎవరు చేస్తారండీ—ఎవరూ అందుకు ఒప్పుకోరండి—'

'శేషయ్యా! ఎవరూ సమ్మె చేయడానికి ఒప్పుకోరా?'

'ఒప్పుకోరండి!'

'ఎవరిచేతా—ఒక్క పిట్టచేత కూడా సమ్మె చేయించే శక్తి నీకు లేదా—'

'లేదండి—లాభంలేదు—ఎవరూ తీరి కూర్చుని సమ్మె చేయరండి—'

'శేషయ్యా! చూడూ—అయితే—'

'ప్రభూ! ఏమిటలా లేస్తున్నారూ?'

'శేషయ్యా! ఈ నిముషం నించి నేను—అనగా మా రాజుని—సమ్మె కడుతున్నాను. ఇంతటినుంచి ఈ వెధవ సంస్థానాన్ని నేను పాలించను! ఛో!'

## తాజమహాలు

'శేషయ్యా? వెధవ నిద్ర తొమ్మిదైనా కానీ...నిన్నే! ఈవేళ మనం మన సంస్థానానికి తిరిగి వెడుతున్నాం—మరచిపోయావా?'

'హు! అబ్బా! ఇవాళటికి మానేద్దామండీ ప్రయాణం—బద్ధకంగా వుంది—'

'తాజమహాల్ హోటల్ నీళ్లు బాగా వంటబట్టినా యన్నమాట—లేవ్వేం?'

'లేచానండి—పదండి, చంపండి, నరకండి—'

'ఎంత కోపం! ఇంకా ఎన్ని పన్లున్నాయో మనకి—అవునుగాని శేషయ్యా...'

'ఏమిటండి మళ్లీ కొత్త ఉపద్రవం...?'

'చిన్న విషయమే—మన సంస్థానంలో—మన వూళ్ళోకూడా ఇలాంటి తాజమహాల్ హోటలొకటి...?'

'ఓహో! ఇది అడగడానికా మీరు నన్ను లేపింది?'

'ఏమంటావ్ శేషయ్యా? మన వూళ్ళోకూడా వొక్క తాజమహల్ హోటలు—ఇలాంటిది—ఎదురుగా ఆ గేట్ వే లాంటి కట్టడం, సముద్ర తరంగాలూ...?'

'నా శ్రాద్ధం! ఏడుపొస్తూంది—నిద్ర మొహంమీద ఏమిటి నాకీ అవస్థ—పెద్ద పని వున్నట్టు నిద్ర పాడుచేశారు—తాజమహల్ హోటళ్లు లేపడం సులువే—ఏదీ ఒక్క తాజమహల్‌ను నిర్మించండి చూదాం—?'

'శేషయ్యా! సరైనమాటన్నావు—ఇంతవరకూ నాకా విషయం స్ఫురించనే లేదు—'

'బాబోయి ఊరుకోండి! బుద్ధి గడ్డితిని అన్నా. ఉపసంహరించు కుంటున్నా—'

'ఏం—అలా?'

'మీతో మహా చెడ్డ చిక్కు! మాటంటే పట్టుకుంటారు—'

'శేషయ్యా! మనంకూడా ఒక తాజమహలును—'

'కాదండి—తాజమహాలు హోటేలును—'

'కాదు శేషయ్యా! తాజమహాలే—ఆగ్రా నగరంలో చూశ్చేదూ, ఆ కట్టడమూ...'

'క్షమించాలి—మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలవటంలేదు—'

'నాకు తెలుసును శేషయ్యా! అదే—ఆగ్రా నగరంలో మనం చూశామూ—ఆ యమునానది ప్రక్కన—'

'దాని వూసెత్తకండి—అరిష్టదాయకం—'

'అలాంటిది మన సంస్థానంలో నిర్మించాలి—'

'ప్రభూ! పాపం శమించుగాక—'

'ఏమిటలా పిచ్చివాడిలా, నాటకంలో నటుడిలా...'

'ప్రభూ! మీరా తాజమహాలును మరిచిపోవాలి. కావలిస్తే ఇలాంటి తాజమహాల్ హోటేళ్ళను కావలిసినన్ని నిర్మించుకుందాం...'

'ఊహూ! నాకు ఆ తాజమహాలే కావాలి–'

'హయ్యో! మీకు అర్థం కావటంలా—'

'ఆగు శేషయ్యా! నువ్వు ఎప్పుడూ నేను ఏది తలుచుకున్నా, దేని కోసం ముచ్చటపడినా ఇలాగే నిరుత్సాహ పరిచావు–ఇదుగో నా ఆఖరుమాట—ఇరవై నాలుగ్గంటలలోగా మన వూళ్ళో అటువంటి–ఆ ఆగ్రానగరంలో వున్నటువంటి—తాజమహాలుకు పునాది పడాలి– తెలిసిందా?'

'ప్రభూ, ఇది అసంభవం! దురన్యాయం! ఘోరం! మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలియటంలా—'

'మరి మాటలు కట్టిపెట్టు శేషయ్యా–నేనంతా నిశ్చయించేసుకున్నా–'

'ఆఁ, ఆవిషయం కూడానా—?'

'ఏ విషయం! ఏ విషయమోయ్ శేషయ్యా!'

'ఆమెసంగతి–శ్రీ రాణిగారి సంగతి—'

'ఏమిటదీ అలా చూస్తున్నావు–ఆమె కేంతటస్థించిందీ?'

'ఆమె బ్రతికివుండగా మీకు తాజమహా లెక్కణ్ణుంచి వస్తుందీ???'

# కన్యాకుమారి

"శేషయ్యా?''

'హా ప్రభూ! అదేమిటీ?''

'ఖంగారుపడి గోల చెయ్యకు - ఈమె బెదిరిపోతుంది—'

'మీ వంశానికి కళంకం తెస్తున్నారు. ఎవరామె? ఈ పవిత్ర సింహాసనంమీద అటువంటి నీచురాలు...ఘోరం!'

'ఏం శేషయ్యా! ఆ మాత్రం అర్హత లేదంటావా ఈమెకూ? చూడూ, అందంగా లేమూ? చారెడేసి కళ్ళూ, నిగనిగలాడే దేహ చ్ఛాయా...?'

'బాగానే వుందండి—ఇంతకీ ఈమె మీ కెక్కడ దఖలు పడిందీ? మిమ్మల్నిలా భ్రష్టుచేసినవా రెవరూ?'